ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 11 సెప్టెంబరు 2025



16న జాబ్‌మేళా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు గూగుల్ పే హైరింగ్ రిక్వెస్ట్ కంపెనీలో 20ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు తెలిపారు. ఈ నెల16న నిర్వహించే కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలకు అర్హులైన ఇంటర్, డిగ్రీఉత్తీర్ణులైన 18 నుంచి 35ఏళ్ల వారు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు తప్పనిసరిగా మొబైల్‌ఫోన్, పాన్‌కార్డు, బైక్ ఉండాలని, మరిన్ని వివరాలకు 8096434123, 8985336947, 8121262441 నంబర్‌లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేడు టీఎల్‌ఎం మేళా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. మండల స్థాయిలో జరిగే ఈ మేళాలో ప్రతిభ కనబరిచిన పదిమంది ఉపాధ్యాయులు, జిల్లావ్యాప్తంగా ఎంపికైన మొత్తం 140మంది ఉపాధ్యాయులు, జిల్లాస్థాయి మేళాలో పాలొంటారని, ఇందులో 8 టీఎల్‌ఎంలను ఎంపికచేసి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. మండలస్థాయిలో ఎంపికైన ప్రతిఉపాధ్యాయుడు ఒకటీఎల్‌ఎంను మాత్రమే ప్రదర్శనకు తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

బిగ్ డిబేట్‌ను జయప్రదం చేయాలి

జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు నరేష్ రత్న

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల15న జరిగే బిగ్‌డిబేట్‌ను విజయవంతం చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు నరేష్‌రత్న పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెండింగ్‌ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలపై పరిష్కారానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు విడుదల చేసేలా కృషి చేయడానికి జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ బిగ్ డిబేట్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పులిపాక సంజీవరాణి

ముత్తారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి ఉత్తమగణిత ఉపాధ్యాయురాలిగా పులిపాక సంజీవరాణి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఇటీవల జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆమెను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రశంసాపత్రం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆమెకు అవార్డు రావడంపట్ల బుధవారం ప్రధానోపాధ్యాయులు, సహచరఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

యూరియా కోసం రైతుల నిరీక్షణ

ఎలిగేడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్, ర్యాకల్‌దేవుపల్లి, రాములపల్లి గ్రామాల్లో రైతులు బుధవారం యూరియా కోసం నిరీక్షించారు. బుధవారం 225యూరియా బస్తాలు రాగా 250కి పైగా రైతులు రాములపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద బారులు తీరారు. ఈ బస్తాలు పంపిణీ చేసి మిగిలిన రైతులకు టోకెన్‌లను ఇచ్చారు. అలాగే సుల్తాన్‌పూర్, రాములపల్లి, ర్యాకల్‌దేవుపల్లి రైతులకు 590బస్తాలతోపాటు 300నానో యూరియా ప్లస్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, పీఏసీఎస్‌చైర్మన్ గోపువిజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

- రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలకు దక్కని చోటు
- ప్రధాన పదవుల్లో ప్రతీసారి కొనసాగిన నేతలు
- కార్యవర్గ సభ్యుల స్థానాలపైనే ఆశలు



బీజేపీ నేతల నారాజ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులకు చోటు దక్కక పోవడంపై వారంతా నారాజ్‌గా ఉన్నారు. రాష్ట్ర కమిటీలోనే కాకుండా ఆయా మోర్చాల అధ్యక్ష పదవులు కూడా ఎవరికీ దక్కక పోవడం గమనార్హం. సోమారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు 22 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో యువకులకు, మహిళలకు, బీసీలకు, కొత్తవారికి పెద్ద పీట వేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, మహిళా, కిసాన్ మోర్చాలకు అధ్యక్షులను కూడా ప్రకటించారు. ఇందులో కూడా జిల్లాకు చెందిన నాయకులకు అవకాశం దక్కలేదు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటైన నాటి నుంచి జిల్లాకు చెందిన సీనియర్ నాయకులకు రాష్ట్ర కార్యవర్గంలో ఆఫీస్ బేరర్ పోస్టులు దక్కుతున్నాయి. ఈ దఫా ఎవరికీ దక్కలేదు. మూడు పర్యాయాలుగా పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొనసాగిన దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు ఏ పదవి దక్కలేదు. అలాగే మాజీఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి పలు పర్యాయాలు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. గోదావరిఖనికి చెందిన బల్మూరి వనిత సైతం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య కూడా ఆఫీస్ బేరర్ పోస్టులో ఉన్నారు. వీళ్లకు కూడా రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించలేదు. జిల్లాలో సీనియర్ నాయకులు మేరుగు హన్మంతు, మీస అర్జున్‌రావు వంటి నేతలు ఉన్నప్పటికీ వారికి పదవులు దక్కలేదు. గుజ్జుల రామకృష్ణారెడ్డి ప్రస్తుతం పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. గడిచిన కార్యవర్గంలో జిల్లాకు చెందిన శీలారపు పర్వతాలు, బల్మూరి వనిత, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, రావుల రాజేందర్, వడ్డెపల్లి రాంచందర్, చంద్రుపట్ల సునీల్ రెడ్డిలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగారు. వడ్డేపల్లి రాంచందర్‌కు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కావడంవల్ల ఆయనకు రాష్ట్రకమిటీలో చోటు లభించనట్లు తెలుస్తున్నది. రాష్ట్రకార్యవర్గ సభ్యుల పదవులను ఇంకా భర్తీ చేయలేదు. ఆ పదవులపై కొంతమంది నాయకులు ఆశలు పెంచుకున్నారు. గత నెలలో రాష్ట్ర అధ్యక్షుడు

(మిగతా 8వ పేజీలో)

పల్లె పాఠశాలలో ప్రపంచస్థాయి విద్యా బోధన

- టీఫైబర్ సాయంతో శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధన
- రాష్ట్రంలోనే మొదటిసారిగా అడవి శ్రీరాంపూర్ పాఠశాలలో ఏఐ టెక్నాలజీ ల్యాబ్
- నేడు ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాడు సమాజంలో అసమానతలు తొలగించడానికి సామాజిక విప్లవానికి అడుగులు పడ్డ అడవి శ్రీరాంపూర్ గ్రామంలో నేడు ప్రపంచ అత్యాధునిక డిజిటల్ విద్యాబోధనకు శ్రీకారంచుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ, టీఫైబర్ సహకారంతో నేడు అడవి శ్రీరాంపూర్ గ్రామం ఇకనుంచి.. ప్రపంచానికి ఐ..ఏఐ శ్రీరాంపూర్‌గా గురువారం ఆవిష్కృతం అవుతుంది. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషిమేరకు రాష్ట్రంలో తొలిసారిగా ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10తరగతుల విద్యార్థులకు ఏఐ టెక్నాలజీతో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. టీఫైబర్ ఆధ్వర్యంలో ఈ పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని గూగుల్‌సహకారంతో ఏఐ విధానంలో విద్యార్థులకు విద్యాబోధన, సందేహాల నివృత్తి చేసుకోవటానికి రాష్ట్రంలోనే మొట్టమొదటి ఏఐ ల్యాబ్‌ను పాఠశాలలో నేడు మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇంటింటికి టీఫైబర్ ఆధ్వర్యంలో హైస్పీడ్ ఇంటర్నెట్‌కనెక్టివిటీని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈపాఠశాలను ఏఐ విద్యావిధానంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా ఉంచటానికి మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు.



అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని/ముత్తారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం మంథని, ముత్తారం మండలాల్లో పర్యటించనున్నారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక శ్రీపాదకాలనీలో రూ.80లక్షలతో నిర్మించే ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్‌కు శంఖుస్థాపన, స్థానిక బాలిక ప్రాథమికపాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించనున్నారు. క్యాంపుఆఫీసులో విద్యార్థులకు బుక్స్, బ్యాగుల పంపిణీ, మంథని, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. ముత్తారం మండలంలోని దర్యాపూర్‌లో రూ.2.80కోట్లతో నిర్మించే సబ్‌స్టేషన్, రూ.2.20కోట్లతోనిర్మించే పోతారం సబ్‌స్టేషన్లకు శంఖుస్థాపన చేస్తారు. ముత్తారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్‌హౌజ్ ప్రారంభిస్తారు. జిల్లెల్లపల్లె గ్రామపంచాయతీ కార్యాలయానికి శంఖుస్థాపన, ముత్తారం మండంలంలో డీఎంఎఫ్‌టీ నిధులతో పాఠశాలలు, అంగన్‌వాడీలకు రిపేర్ల కోసం రూ.2.81తో శంఖుస్థాపన చేస్తారు. అడవిశ్రీరాంపూర్‌లో ప్రభుత్వపాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి ఎల్‌ఎంఎస్ బుక్స్ పంపిణీ చేస్తారు. టీఫైబర్ సీఎస్ఆర్ ద్వారా గ్రామంలో సీసీటీవీ ప్రారంభిస్తారు.

గొయ్యి పూడ్చారు..డ్రైనేజీని క్లీన్ చేశారు..

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనివన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎల్‌బీనగర్ వరకు ఉన్న రోడ్డు, డ్రైనేజీఅధ్వాన్నంగా మారిందని ఈనెల9న 'అధ్వాన్నంగా రహదారి...'అని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం రహదారిపై ఏర్పడినగొయ్యిని పూడ్చిడ్రైనేజీని శుభ్రం చేశారు.



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీతీసి అయ్యప్ప టెంపుల్ వద్ద రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సకాలంలో యేరియా వేయక పోవడం వల్ల సరై పంట దిగుబడి రాదన్నారు. రైతులకు యూరియా అందించే వరకు బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ జెడ్పీటీసీలు గంట రాములు, వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్, మోహన్‌రావు, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్‌కుమార్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, ఐరెడ్డి వెంకటరెడ్డి, మోబిన్, సలేంద్ర రాములు, ముత్యాలరాజయ్య, నిదానపురం దేవయ్య, తాళ్లపల్లి మనోజ్, పెంచాల శ్రీధర్, మల్లేశం, ఖదీర్ ఖాన్, కొయ్యడ విక్రం, మేడగోనిశ్రీకాంత్ ముఖీమ్, మేకల కుమార్, సలేంద్రశ్రీనివాస్, సందీప్‌రావు,శ్యామ్, బాబురావు, గొట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముగిసిన మండల, జిల్లా పరిషత్ ఓటర్ల ప్రక్రియ

- జిల్లాలో 4,04,181 మంది ఓటర్లు
- పురుషులు 1,98,728 మంది, స్త్రీలు 2,05,439 మంది

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను బుధవారం అన్ని గ్రామపంచాయతీలు, మండలపరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలోని 13గ్రామీణ మండలాల్లో 137 ఎంపీటీసీలు, 13 జడ్పీటీసీ స్థానాల్లో 741పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. మొత్తం 4,04,181మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,98,728 మంది, స్త్రీలు 2,05,439 మంది, ఇతరులు 14మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఈనెల 2న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన తుది జాబితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. అవే జాబితాల ఆధారంగా 137ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ బూతుల వారీగా ఓటర్ల జాబితాలను రూపొందించారు. ఈ నెల 6న ముసాయిదా జాబితాలను ప్రదర్శించారు. వీటిపై పెద్దగా అభ్యంతరాలు రాకపోవడం వల్ల ఓటర్ల తొలగింపు గానీ, చేర్పులు, మార్పులు గానీ జరగలేదు. వివిధ రాజకీయపార్టీల నాయకులతో కూడా మండల, జిల్లా స్థాయిలో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ నెలాఖరు వరకు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ ఎన్నికల నిర్వహణకు ప్రధాన సమస్య బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే విషయమై అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు, 2018 పంచాయతీరాజ్ చట్టం, 2019 పురపాలక చట్టాలను సవరించి ఆర్డినెన్స్‌లను రాష్ట్ర గవర్నర్‌కు పంపించగా, అక్కడి నుంచి రాష్ట్రపతికి పంపించారు. ఆ బిల్లులపై ఎటూ తేలకపోవడంతో ఎన్నికలు జాప్యం అవుతున్నాయి. చివరకు ప్రభుత్వం ఈనెల 1న నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు సభ ఆమోదం పొందింది. దీనిపై ప్రభుత్వం జీవో విడుదల చేయడంలో జాప్యం చేస్తుండడంతో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాల తయారీ పూర్తయ్యాయి.

ఇక షెడ్యూల్ వెలువడడమే తరువాయి. ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించినా కూడా అందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికలైతే మూడు విడతల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను ఒకేవిడతలో నిర్వహించనున్నారు.

మండలాల వారీగా మండల, జిల్లా పరిషత్ ఓటర్ల తుది జాబితా..

క్ర.సం.	మండలం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
1.	అంతర్గాం	6	35	8807	9122	1	17930
2.	ధర్మారం	15	85	21483	22210	4	43697
3.	ఎలిగేడు	6	37	9088	9481	1	18570
4.	జూలపల్లి	9	46	11977	12186	0	24163
5.	కమాన్‌పూర్	7	34	9875	10270	0	20145
6.	మంథని	11	67	17040	17929	4	34973
7.	ముత్తారం	8	40	11328	11868	1	23197
8.	ఓదెల	12	65	17588	18219	0	35807
9.	పాలకుర్తి	10	47	13934	14184	0	28118
10.	పెద్దపల్లి	17	92	24989	25996	1	50986
11.	రామగిరి	11	54	16167	16406	1	32574
12.	శ్రీరాంపూర్	12	65	17225	17595	1	34821
13.	సుల్తానాబాద్	13	74	19227	19973	0	39200
	మొత్తం	137	741	198728	205439	14	404181

గోదావరి పుష్కరాలకు కార్యాచరణ సిద్ధం చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కె శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాల ఏర్పాట్ల సన్నద్ధతపై అదనపుకలెక్టర్లు డి వేణు, జె అరుణశ్రీతో కలిసి నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో జిల్లాలో సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సమ్మక్కసారలమ్మ జాతర గోదావరిఖని, మంథని గౌతమేశ్వర ఆలయం, సమ్మక్క సారలమ్మ జాతర గోలివాడ, ప్రాంతాల్లో స్నానాల ఘాట్లలో పుష్కర స్నానాలు జరిగాయని కలెక్టర్ తెలిపారు. గోలివాడ స్నానాల ఘాట్ దెబ్బతిన్నం దున నూతనఘాట్ నిర్మాణం, గౌతమేశ్వర ఆలయంవద్ద ప్రస్తుతం ఉన్న స్నానాల ఘాట్‌కు అదనంగా మరో ఘాట్ సురబండేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించడానికి ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. గతపుష్కరాల సమయంలో వచ్చిన భక్తుల సంఖ్య, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో ఎంతమంది పుణ్యస్నానాలు ఆచరిస్తారో అంచనా వేస్తూ దానికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జడ్పీసీఈవో నరేందర్, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, గోదావరిఖని ఏసీపీ రమేష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ సూపర్వైజర్ల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మెరుగు పరుచుకోకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు నిబంధనల ప్రకారం పనిచేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. అంగన్‌వాడీకేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో పిల్లల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని, ప్రతి కేంద్రంలో కనీసం 15మంది పిల్లలు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పాలు, కోడిగుడ్లు, పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాలను సరిగ్గా స్టోర్ చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి అందించే ఆహార పదార్థాల నాణ్యతను రెగ్యులర్‌గా చెక్‌చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో పాడైన ఆహార పదార్థాలు పిల్లలకు, గర్భిణులకు ఇవ్వకూడదన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు, సీడీపీవోలు అలేఖ్య, పుష్ప పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భూసమస్యల పరిష్కారం

ఓదెల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ భారతిచట్టం క్రింద నిబంధనల మేరకు భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు రెవెన్యూ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రికి ఎలాంటి రోగులు వస్తున్నారని, జ్వరాల పరిస్థితి ఎలా ఉందని తెలుసుకున్నారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండాలని, వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. వర్షాల వల్ల కలుషిత నీటి ప్రభావం ప్రజలపై పడకుండా అప్రమత్తం చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవగాహన కల్పిస్తూ, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ ధీరజ్‌కుమార్, ఎంపీడీవో తిరుపతి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

కల్వచర్ల గ్రామపంచాయతీని తనిఖీ చేసిన డీపీవో

రామగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీని బుధవారం డీపీవో వీరబుచ్చయ్య తనిఖీచేశారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులు, తడి, పొడి చెత్త సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యపనులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీసెక్రెటరీని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించాలి

- జిల్లా క్రీడల అధికారి సురేష్

సుల్తానాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడల్లో తగిన శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని జిల్లాక్రీడల యువజనశాఖ అధికారి సురేష్ అన్నారు. రెండురోజులుగా ప్రభుత్వజూనియర్ కళాశాల వేదికగా సాగుతున్న సుల్తానాబాద్ ఎస్‌జీఎఫ్ జోనల్‌స్థాయి పోటీలు బుధవారం ముగిసాయి. సుల్తానాబాద్, ఓదెల, జూలపల్లి, ఎలిగేడు మండలాలనుంచి 800మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాడీవైఎస్‌వో అక్కపాక సురేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ బహుమతులు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నేటి ఓటమి భవిష్యత్‌లో గెలుపునకు నాందిగా మారుతుంద న్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి, సుల్తానాబాద్ జోనల్‌కార్యదర్శి, జిల్లాపేటకార్యదర్శి దాసరిరమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, సంధ్య, శ్రీవాణి, ఆసియా, వెంకటేష్, శ్రీకాంత్, సదానందం, శ్రీనివాస్, సత్యం, ఇక్బాల్, ప్రవీణ్, అజ్జు, సునీత, సరోజ, స్వరూప, వెంకటలక్ష్మి, రాజేందర్, హరికృష్ణ, స్వప్న, ప్రణయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడలకు నోబెల్ పాఠశాల విద్యార్థిని ఎంపిక

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఏర్పాటు చేయగా పెద్దకల్వల గ్రామానికి చెందిన నోబెల్ హైస్కూల్ విద్యార్థిని రిషికశ్రీ కబడ్డీపోటీలో జిల్లాస్థాయిలో ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రాజా మాట్లాడుతూ కబడ్డీక్రీడల్లో మంచి ప్రతిభకనబరిచి జిల్లాస్థాయిలో ఎంపికకావడం చాలాసంతోషంగా ఉందని అభినందించారు. పాఠశాలలో విద్యార్థిని రిషికశ్రీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రణీత, పీడీ సురేష్ ఉన్నారు.



విద్యార్థిని రిషికశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ మోహన్ రాజా

క్రీడాసమాఖ్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎలిగేడు: ఎలిగేడు ప్రభుత్వఉన్నతపాఠశాల విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా అత్యున్నతప్రతిభ కనబరిచారు. ఈనెల8నుంచి మూడురోజులపాటు సుల్తానాబాద్‌లో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో జోనల్‌లెవల్ పోటీలు జరిగాయి. ఇందులో అండర్ 17 విభాగంలో కబడ్డీలో మీనుగు భూలక్ష్మి, ఎడ్లసాయి, ఖోఖో విభాగంలో బాసంపల్లి అభినయ్ కుమార్, అండర్ 14కబడ్డీలో బాసంపల్లి రిశ్వంత్ జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గండ్ర దేవెందర్‌రావు అభినందించారు.

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై సమీక్ష



ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించనున్న బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు జన సమీకరణ, సభ ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. బేగంపేట టూరిజం ప్లాజాలో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఒక్కో జిల్లా నుంచి 15 వేల మందిని కామారెడ్డి సభకు తరలించాలని నిర్ణయించి సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారయణ, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్లు సత్తు మల్లేశం, నాగుల సత్యనారాయణగౌడ్, నేరెళ్ల శారద, కేకే మహేందర్‌రెడ్డి, ప్రణవ్‌బాబు, ఝెలిచాల రాజేందర్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి పాల్గొన్నారు.

గంభీరావుపేటలో వైరల్ ఫీవర్

● జ్వర బాధితులతో నిండిన ఆసుపత్రి



గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలాన్ని వైరల్ ఫీవర్ వణికిస్తోంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి జ్వర పీడితులతో నిండిపోయింది. మూడు నాలుగు రోజుల నుంచి జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. తీవ్రమైన తలనొప్పి, కాళ్లనొప్పులతో పాటు జలుబు, జ్వరంతో ఆసుపత్రికి వందల సంఖ్యలో వస్తున్నారు. ఓ వైపు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటం మరోవైపు సరిపడా బెడ్లు లేకపోవడం కొంత సమస్యగా మారింది. దీంతో కొందరికి రక్త పరీక్షలు నిర్వహించడం, మరికొందరికి మందులు ఇచ్చి పంపిస్తూ, రక్త పరీక్షలకు మరుసటి రోజు రావాలని సూచిస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



రాజేష్‌యాదవ్(ఫైల్)

జైపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ మృతదేహం లభ్యం అయినట్టు ఎస్సై శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన గణపతి నిమజ్జనంలో ప్రమాదవశాత్తూ ఇందారం గోదవరి బ్రిడ్జిపై నుంచి కాలుజారి గోదావరి నదిలో పడి గల్లంతయ్యాడు. బుధవారం రాజేష్‌యాదవ్ మృతదేహం లభించింది. మృతదేహం మండలంలోని శివ్వారం గోదావరి పరివాహక ప్రాంతం నది ఒడ్డున మృతదేహం కనిపించగా స్థానిక రైతులకు తమకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి రాజేష్ యాదవ్ మృతదేహంగా గుర్తించామన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

వణికిస్తున్న వానరాలు.. పరుగులు పెట్టిస్తున్న శునకాలు..

● కూరగాయలు, పంట చేలు ధ్వంసం
● దాడులతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న ప్రజలు

మంథనిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథనిలో కోతులు, కుక్కలతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. కుక్కలు, కోతులు వీధులలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతండటంతో ప్రజలు గాయాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మంథని



ఇళ్లల్లోకి వచ్చిన కోతులు

పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. కోతుల కారణంగా ఇండ్ల పైకప్పులు, కూరగాయల మొక్కలు, పండ్ల చెట్లు దెబ్బ తింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. షాపుల్లోకి, ఇళ్లలోకి చొరబడి సామగ్రిని ఎత్తుకుపోతున్నాయి. అడ్డుకోవటానికి ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయని వాపోతున్నారు. కోతుల గుంపు వచ్చిందంటే కొన్ని గంటల పాటు నరకమేనని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరోవైపు కుక్కలు కూడా గుంపులు, గుంపులుగా తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నాయి. కోతులు, కుక్కలు కారణంగా పాఠశాలల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పనుల కోసం బయటకు వెళ్లే మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. తమ వెంట కర్ర పట్టుకొని వెళ్లుతున్నారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు, క్రీడాకారులు మైదానానికి రావాలంటే జంకుతున్నారు. ఆగస్టు నెలలో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో కోతుల



మంథని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

దాడిలో 156, కుక్కలదాడిలో 42మంది. ఈ నెలలో 52మంది కోతులు, కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా మంథని మున్సిపాల్, అటవీశాఖ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తెలతాడు చోరీ

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకవ్వకు చెందిన రెండు తులాల పుస్తెల తాడును బుధవారం దొంగలు అపహరించుకొని వెళ్లినట్లు బాధితురాలు వెంకవ్వ తెలిపారు. మధ్యాహ్నం వెంకవ్వ మెడలో నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనదారులు పుస్తెల తాడును లాక్కొని వెళ్లినట్లు తెలిపారు. బాధితురాలి కుమారుడు లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వెంకట్రావుపల్లెలో కొనసాగుతున్న 144 సెక్షన్

ముస్తాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోందని ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ప్రభుత్వ స్థల విషయంలో ఓ వర్గానికి, గ్రామస్థులకు మధ్య జరుగుతున్న వివాదంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు గ్రామంలో పోలీసులు బందో బందుబస్తు ఏర్పాటు చేశారు. ధర్నా చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యం

● శాతవాహన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు
● విరాళాలు ప్రకటించిన ఎన్‌ఆర్‌ఐలు
● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యమని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ తెలిపారు. బుధవారం యూనివర్సిటీ సెమినర్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అమెరికా పర్యటనలోని వివరాలను వెల్లడించారు. 2008లో స్థాపించిన యూనివర్సిటీ భిన్న కోర్సులు, నాలుగు పీజీ సెంటర్లతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయంగా పేరు తెచ్చుకునేందుకు ముందుకుసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఉపకులపతి శాతవాహన ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేశా మని, అమెరికా వెళ్లి అక్కడి నుంచి శిక్షణ, పరిశోధన, మెరుగైన అవకాశాల కోసం ఎన్నారైల నుంచి విరాళాలు సేకరించామన్నారు. సాంకేతిక అభివృద్ధి కోసం కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలకు సహాయం చేశారన్నారు. పీజీ విద్యార్థుల స్నాతకోత్సవానికి బంగారు పతకాలను అందజేశారన్నారు. బోస్టన్ నగరంలో మీట్ అండ్ గ్రీట్ ద్వారా తెలంగాణ ఎన్నారై సంఘం బోస్టన్ చాప్టర్ రూ.3 లక్షల విరాళం ఇచ్చినట్లు చెప్పారు. డాక్టర్ దివాకర్ జాన్దియం, కోట సుమన్ రెడ్డి రూ.2లక్షల చొప్పున బంగారు పతకాలు అందజేశారన్నారు.



వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

హూస్టన్ నగరంలో జితేందర్ రెడ్డి రూ.లక్ష, డాక్టర్ రాజశేఖర్ ఎలమంచిలి వెయ్యి డాలర్లు, అనురాధ, డాక్టర్ రమేష్ చర్విరాల రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని తెలిపారు. షార్లెట్‌లో కృష్ణ కాదరి రూ.లక్ష, దామోదర్ రెడ్డి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. ఫిలడెల్ఫియాలో కర్ర సుభాష్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాన్ని అందజేశారని, న్యూయార్క్‌లో సుధాకర్‌రావు విదియాల హెచ్‌పీఎల్‌సీ పరికరం, రూ.2 లక్షల బంగారు పతకం, ఏటా కెమిస్ట్రీ విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి, హైదరాబాద్ ప్లాంట్‌లో ఐదుగురు విద్యార్థులకు ఇంటర్నెట్ షిప్ సదుపాయాలు కల్పించారన్నారు. న్యూ జెర్సీలో డాక్టర్ బండారి సుధాకర్ 10 కంప్యూటర్లను, ప్రదీప్ సువర్ణ రూ.2 లక్షల బంగారు పతకం, డాక్టర్ మనోహర్ శ్రీరామోజి రూ.2లక్షల బంగారు పతకం ఐదు సంవత్సరాల వరకు అందజేస్తామన్నారని తెలిపారు. డాక్టర్ కిషోర్ భూపతి రూ.2 లక్షల, శరత్‌రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకాలు అందజేశారన్నారు. వాషింగ్టన్ డీసీలో జనేత రెడ్డి రూ.2 లక్షల బంగారు పతకం లా విద్యార్థుల కోసం అందజేసినట్లు చెప్పారు. నవంబరు రెండో వారంలో విశ్వవిద్యాలయంలో రెండోసారి స్నాతకోత్సవాలను నిర్వహిస్తామని, ఇందులో విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎన్నారైల సహకారంతో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలోనే మొదటి వరుసలో నిలపడానికి ప్రయత్నం చేస్తామని,వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

వృద్ధురాలి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు

ఇల్లందకుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన కళ్లెం అమృతమ్మ ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారించారు. అమృతమ్మ భర్త చిన్న రాజిరెడ్డి పదేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త మృతి చెందిన తర్వాత కొడుకులిద్దరూ తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఎలాంటి జీవనభృతి లేకపోవడం వల్ల ఎడ్ల దొడ్డిలో జీవనం సాగిస్తున్నారు. కొడుకులు తనను పట్టించుకోవడం లేదని అమృతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు గిర్దావర్ నాగరాజు, కానిస్టేబుల్ రాజేష్, మహిళ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ జ్యోతి, సఖి కౌన్సిలర్ పద్మావతి, డీహెచ్‌హెడ్ జెండర్ స్పెషలిస్టు కవితలు బోగంపాడు గ్రామంలోని అమృతమ్మ ఉంటున్న గుడిసెను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అధికారులు పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందించనున్నట్లు తెలిపారు.



అమృతమ్మను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

గర్షకుర్తి మరమగ్గాలపై విజిలెన్స్ తనిఖీలు

గంగాధర, సెప్టెంబరు 110 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం గర్షకుర్తి పవర్ లూమ్స్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడీ చేశారు. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు ఏడీ అనిత ఆధ్వర్యంలో చెన్నయ్‌కి చెందిన అధికారుల బృందం దాడీ చేశారు. మర మగ్గాలపై కలర్ చీరలు తయారు చేస్తున్న గర్షకుర్తికి చెందిన మిట్టపల్లి వెంకటేశ్ మగ్గాలపై దాడులు చేసి కేసు నమోదు చేసి, దూస వెంకటేశ్‌ల మరగ్గాలపై దాడులు చేసి రంగుల చీరలు తయారు చేస్తుండగా కోసివేశారు. పాత జీవో ప్రకారం కలర్ చీరలు తయారు చేయవద్దని ఆర్డర్లు ఉన్నప్పటికీ కార్మికులు వాటిని తయారు చేస్తుండగా కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గ్రామంలో మగ్గాలను పరిశీలిస్తూ కలర్ చీరల తయారీ కార్మికులను బెంబేలెత్తించారు.



మగ్గాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని మైత్రి హోటల్ వద్ద ఈ నెల 7న సాయంత్రం డబ్బుల విషయంలో నిష్టూరి యశ్వంత్, ముద్దుల మధును కారులో కిడ్నాప్ చేసి, బెదిరించి డబ్బులు తీసుకున్న కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేశామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ కేసులో నల్లపాటి నరేష్, గుడిమల్ల సివిల్, తునికిపాటి శేఖర్, ఆలకుంట ఉపేందర్, ఆలకుంట అశోక్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధమున్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ

● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో గణేష్ చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ చేశారని బాధితులు బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లెడ గ్రామంలో గణేష్ నవరాత్రులకు సంబంధించిన చందా ఇవ్వకపోవడంతో తమ నాలుగు కుటుంబాలను కులం నుంచి వెలివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని షరతులు విధించారన్నారు. ఎవరైనా మాట్లాడితే రూ.25 వేల జరిమానా విధిస్తామని కుల పెద్దలు హెచ్చరించినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

హైనా దాడిలో శునకం మృతి

మల్యాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో గల సివిల్ సప్లై గోదాం వద్ద వన్యప్రాణి హైనా దాడిలో శునకం మృతి చెందింది. బుధవారం గోదాంల వద్ద శునకం మృతి చెందడాన్ని గోదాం సిబ్బంది గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అర్ధరాత్రి వన్యప్రాణి ఈ ప్రాంతంలో సంచరించినట్లు ఇక్కడ లభించిన ఆనవాళ్ల మేరకు హైనాగా అటవీ అధికారులు అనుమానిస్తున్నారు. హైనా సంచారం స్థానికులను ఆందోళనకు గురి చేస్తోంది.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు

వీణవంక,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డిపై ఆధారాలు లేకుండా సోషల్ మీడియా వాట్సప్ గ్రూపులలో అనుచిత వాక్యలు చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు పోస్టులు పెట్టడంతో మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బావు రాకేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రెండు పార్టీల మధ్య గొడవలు జరిగేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్‌ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్ రెడ్డి,బండా కిషన్ రెడ్డి,ఖుర్శుల చరణ్ రావులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో ఇతరులకు భంగం కలిగేలా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వారితో సామాజిక సేవ

● ఆస్పత్రిలో పండ్లు .. విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ
● గోదావరిఖని కోర్టు ఆదేశాలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో పరివర్తన తీసుకువచ్చేందుకు గోదావరిఖని కోర్టు జరిమానాలతో పాటు సామాజిక సేవ చేయాలనే ఆదేశాలనిచ్చింది. బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి అంతర్గాం, ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 8మంది మందు బాబులకు ఒక్కొక్కరికి రూ.2వేల నుంచి రూ.4వేల జరిమానా విధించడంతో పాటు సామాజిక సేవలను శిక్షలుగా విధించారు. జడ్జి ఆదేశాల మేరకు కోర్టు కానిస్టేబుళ్లు రవికుమార్, బుర్ర శ్రీనివాస్ శిక్షలు అమలు చేయించారు.

ప్రభుత్వాసుపత్రి, పాఠశాల ఆవరణలను శుభ్రం చేయడం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, విద్యా ర్థులకు నోట్ పుస్తకాల పంపిణీతో పాటు గాంధీనగర్‌లోని ఇందిరమ్మ సర్కిల్ వద్ద మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ విధులు నిర్వహించారు.



మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

చెరువులో పడి వృద్ధురాలు మృతి

గంభీరావుపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట నమాజ్ చెరువులో మారవేణి మల్లవ్వ(68) అనే వృద్ధురాలు పడి మృతిచెందింది. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన మల్లవ్వ సమీప నమాజ్ చెరువులో అదేరోజు రాత్రి శవమై కనిపించింది. మల్లవ్వకు మానసిక పరిస్థితి బాగాలేకనే చెరువులో పడి చనిపోయిందని మృతురాలు బంధువులు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు మల్లవ్వ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా మల్లవ్వ దొరకలేదు. అదేరోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో సమీప నమాజ్ చెరువులో మల్లవ్వ శవమై కన్పించింది. మానసిక పరిస్థితి బాగాలేకనే మల్లవ్వ చెరువులో పడి ఊపిరి ఆడక చనిపోయిందని మృతురాలు కొడుకు సాయిలు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షా 15 వేల కోట్లు దోచుకున్న కేసీఆర్

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్షా 50 వేల కోట్లు ఖర్చయినట్లు కేసీఆర్ చెప్పారని, వాస్తవంగా 35 వేల కోట్లు ఖర్చవగా మిగతా లక్షా 15 వేల కోట్లు కేసీఆర్ కుటుంబం దోచుకుందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కోటి 40 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయని, రక్తం దారపోసి కర్త, కర్మ, క్రియ, ఇంజనీరుగా అన్ని తానై కట్టినట్లు చెప్పారని అన్నారు. ప్రాజెక్టు అవినీతి, అక్రమాలపై జస్టిస్ గోష్ కమిషన్ చేసిన విచారణ అనంతరం నివేదికలో వాస్తవాలు బయటపడ్డాయన్నారు. జస్టిస్ గోష్ కమిషన్ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు అందజేశారన్నారు. లక్ష 15 వేల కోట్లు అవినీతి జరిగిందని, కానీ ఇందులో తనకు ఎలాంటి సంబంధమూ లేదని, ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మొత్తం కేసీఆర్ తీసుకున్నారని నాటి ఇరిగేషన్ మంత్రి హరీష్‌రావు గోష్ కమిషన్‌కు స్పష్టం చేస్తూ లిఖితపూర్వకంగా రాసిచ్చారన్నారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అందజేశారన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష 15 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రజల కష్టార్జితమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగింది వాస్తవమని, కానీ ఆ అవినీతిని చేసింది మాత్రం నాడు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీష్‌రావు మాత్రమేనని స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇసుక వ్యాపారం చేసిన సంతోష్‌రావు అందులో వేల కోట్లు దోచుకున్నారని కవిత చెప్పిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. హరితహారం పేరుతో సంతోష్‌రావు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఇటీవల కవిత బహిరంగంగా చెప్పారన్నారు. కేసీఆర్ కూతురు కవిత స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెబుతుంటే కేటీఆర్ సిగ్గు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్ములావన్ కేసులో అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికిన కేటీఆర్ ఇప్పుడు దానిపై లొట్ట పీసు కేసు అంటూ పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నేరెళ్లలో ఇసుక మాఫియాపై ప్రశ్నించినందకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఏ పని చేసుకోని విధంగా కొట్టి వారి జీవితాలను నాశనం చేశారని స్వయంగా కవిత చెప్పారన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత కోట్ల రూపాయలతో భవనాలు, ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారని, కేసీఆర్ 60 ఎకరాలలో ఉన్న ఫామ్ హౌస్ నేడు 600 ఎకరాలు అయ్యిందని అన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత అమెరికా, దుబాయ్, సింగపూర్‌లలో వేల కోట్లు పెట్టుబడులకు డబ్బు ఎలా వచ్చిందో చెప్పాలన్నారు. ఆస్తుల పంపకాల్లో గొడవలతోనే కవిత ఇదంతా బయట పెట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో నిజాం వారసులకు చెందిన 30 వేల ఎకరాల భూమిని కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్ రావు, కవిత కబ్జా చేశారని, దీని కోసమే ధరణి తీసుకొచ్చారని అన్నారు. నిజాంకాలంలో నిర్మించిన సచివాలయం పునర్నిర్మాణంలో భాగంగా జరిపిన తవ్వకాల్లో బంగారం, పచ్చ రంగు వజ్రాలు బయటపడ్డాయని, వాటిని సమానంగా పంచాలని కవిత డిమాండ్ చేయడంతో ఆ కుటుంబంలో గొడవలు వచ్చాయని అన్నారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువకులు ఉద్యమాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తే, చలించిపోయిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్ సీఎం అయ్యాక వారి ఇంట్లో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ నలుగురి ఉద్యోగాల తరువాత తెలంగాణ రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలయ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, కల్వల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పురోహితుడు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన తివారి శైలేందర్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శైలేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని ఓ గది అద్దెకు తీసుకుని స్థానిక ఆలయంలో పురోహితుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలోని నారోజు రాజు బైక్‌పై వెళుతున్న క్రమంలో శైలేందర్ భార్య శైలతో పాటు కుటుంబ సభ్యులు అడ్డుకునేందుకు యత్నించారని చెప్పారు. వారి ద్విచక్రవాహనాన్ని వెంబడించి అతని స్నేహితులతో మాట్లాడుతున్న తరుణంలో శైలేందర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆరా తీశారని తెలిపారు. ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. తన భర్త కనిపించకపోవడానికి కొండాపూర్ వాసి నారోజు రాజుపై అనుమానం ఉందని పేర్కొంటూ శైలేందర్ భార్య శైల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

వివాహిత మృతికి కారణమైన అత్త, బావలపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : వివాహిత ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని మృతురాలు అత్త ఈరవేణి లక్ష్మి, బావ సత్యనారాయణలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలోని వివాహిత ఈరవేణి రమ్య తన అత్త లక్ష్మి, బావ సత్యనారాయణలు మానసికంగా వేధించడంతో మనస్తాపం చెంది ఈనెల 9న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఎల్లంపల్లికి.. బీఆర్ఎస్‌కు ఏం సంబంధం?

● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

హైదరాబాద్ సెప్టెంబర్10 ,(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించినట్టుగా బీఆర్ఎస్ నాయకులు తెగ ఊదర గొడుతున్నారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. అసలు ఎల్లంపల్లి ప్రాజెక్టునకు బీఆర్ఎస్‌కు ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. బుధవారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విలేకరులతో మాట్లాడుతూ ఎల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మానస పుత్రికగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టునకు శంకుస్థాపన జరిగిందని, పనులు సైతం పూర్తి చేసినట్టు ఆయన స్పష్టం చేశారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టును తామేనిర్మించామన్నట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీష్‌రావు తెగ ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభించిన పక్షంలో కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి వరకు అధికారికంగా ప్రారంభోత్సం చేయలేదన్నారు. ఒక వేళ ఎల్లంపల్లిని పూర్తి చేసిన పక్షంలో కేసీఆర్ ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. ఈ ప్రాజెక్టుతో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లోని 2.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే సింగరేణి, సింగరేణి విద్యుత్ సంస్థలకు ఇక్కడినుంచే నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అబ్దుల్ కలాం సుజల స్రవంతి కింద 10 టీఎంసీలు గ్రేటర్ హైదరాబాద్‌కు పైప్‌లైన్‌ల ద్వారా తాగు నీటికోసం పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

లక్ష ఉద్యోగాలకు కట్టుబడిన కాంగ్రెస్ సర్కార్

● ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్ సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్న మాటకు కట్టుబడి ఉందని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. టీజీపీఎస్సీపై హైకోర్ట్ తీర్పులో కాంగ్రెస్ పార్టీని కానీ ప్రభుత్వాన్ని ఎక్కడ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఎలాంటి అవకతవకలు జరగలేదని పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో యువతకు బతుకులను చీకట్లో నెట్టింది మీ పార్టీ, మీ నేత కేటీఆర్ కాదా. అని ప్రశ్నించారు. అవాకులు చెవాకులు పేలితే మాటలతో కాదు... చేతలతో చూపించాల్సి వస్తుందని మక్కాన్ సింగ్ ఠాకూర్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి యువత భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు. నిరుద్యోగులు బీఆర్ఎస్ నాయకుల రెచ్చగొట్టే మాటలు నమ్మవద్దని కోరారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని , ఏ విద్యార్థికి నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

ఏడుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం మత్తులో న్యూసెన్స్ చేసిన ఏడుగురు యువకులను బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్‌కు చెందిన పైండ్ల అజయ్, తిరుపతి, స్వామి, సాయి కేశవ్, రాజేందర్, కుమార్, శ్రీనును బుధవారం స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

'న్యాయ నిర్మాణ్ భవన్'కు శ్రీకారం



- త్వరలో అద్దె భవనంలోకి మారనున్న నాలుగు కోర్టులు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో జీప్లస్ 4 అంతస్థులు.. 12 కోర్టులకు రూపకల్పన
- రూ.81.26కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో జిల్లా కోర్టు మోడల్ భవనం నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సిరిసిల్ల పట్టణంలో 5.1ఎకరాల స్థలంలో జిల్లా కోర్టు భవన సముదాయాన్ని నిర్మించడానికి ప్లాన్ సిద్ధమైంది.ఇందులో భాగంగానే రోడ్డు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు జిప్లస్4 అంతస్తులతో 12కోర్టుల నిర్మాణానికి రూపకల్పన చేశారు. భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 81.26కోట్లు కేటాయించింది. నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణ పనులు ఈనెలాఖరులోగా చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది.

● నేలమట్టం కానున్న పాత భవనం

పాత తాలుకా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 1973లో మున్సిఫ్‌కోర్టును ప్రారంభించారు. 52సంవత్సరాల క్రితం పక్కా భవనంలో ఏర్పాటుచేసిన మున్సిఫ్ కోర్టు పాత భవనం నేలమట్టం కానుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాగా రూపాంతరం చెందిన తర్వాత సిరిసిల్లకు జిల్లా కోర్టు, 1వ అదనపు సెషన్స్ జిల్లా కోర్టుతో పాటు పోక్సో కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరయ్యాయి.ఈవిధంగా కోర్టుల సంఖ్య పెరగడంతో పాత భవనాలు సరిపోవడంలేదు. దీంతో ప్రభుత్వం జిల్లా కోర్టుసమీకృత భవన సముదాయం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

● ఈనెల 15న అద్దెభవనంలోకి కోర్టులు..

నూతన కోర్టు సమీకృత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండడంతో ఈనెల 15న అద్దె భవనంలోకి మారనున్నాయి. మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జారీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సర్దార్‌నగర్‌లో గల ఓ భవనంలోకి మూడు కోర్టుల వ్యవహారాలు సాగుతాయి. ఇందులో పీడీఎం, ఏడీఎం, 2వ ఏడీఎం కోర్టులు ఉంటాయి. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో అద్దె భవనంలోకి సీనియర్ సివిల్ కోర్టు మారుతోంది. మిగతా జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టులు ప్రస్తుతం ఉన్న బార్ అసోసియేషన్ హాలులోనే కొనసాగుతాయి.



తాత్కాలికంగా ఏర్పాటుకానున్న అద్దె బిల్డింగ్

● అధునాతనంగా 'న్యాయ నిర్మాణ్ భవన్'

జిల్లాకేంద్రంలో అధునాతన పద్ధతిలో 'న్యాయ నిర్మాణ్ భవన్' సముదాయం నిర్మాణానికి సిద్ధం చేశారు. జీప్లస్4 విధానంలో భవన సముదాయాన్ని నిర్మించడానికి రూపకల్పన చేశారు. భవిష్యత్తులోనూ మరో రెండు అంతస్తులు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 12 కోర్టు హాళ్లు, ఆఫీసర్స్ చాంబర్స్, ప్రతి ఫ్లోర్‌లో బార్ అసోసియేషన్ హాలు, టాయిలెట్స్, కక్షిదారుల చాంబర్, విజిటర్స్ చాంబర్‌లను మోడల్ విధానంలో నిర్మించడానికి రూపొందించారు. ప్రతి ఫ్లోర్‌కు వెళ్లేందుకు కక్షిదారులకు ఒక లిఫ్ట్, న్యాయ వాదికారులకు ఒక లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండుఫ్లోర్‌లో పూర్తిస్థాయిలో 88 కార్లు, 62బైక్‌లు పార్కింగ్ సౌకర్యం కల్పించడానికి నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం ఉన్న జిల్లా కోర్టు, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు, పోక్సో కోర్టు, ఫ్యామిలీ కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, 1వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు, 2వ అదనపు జూనియర్ సివిల్ కోర్టులతోపాటు భవిష్యత్తులో మంజూరయ్యే మరో ఆరు కోర్టులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా న్యా యనిర్మాణ్ భవనాన్ని నిర్మించడానికి టెండర్ ప్రక్రి య పూర్తయింది. ఈ టెండర్‌ను కెఎంవిఆర్ కంపెనీ దక్కించుకొని 24నెలల్లో పూర్తిచేయడానికి అగ్రిమెంట్ చేసుకొంది.

అద్దె భవనంలోకి నాలుగు కోర్టులు..

- పీ. నీరజ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అధునాతన పద్ధతులతో నూతన కోర్టు భవనం నిర్మాణానికి ముహూర్తం చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నాలుగు కోర్టులు అద్దె భవనంలోకి మార్చుతాం. సువిశాలమైన స్థలంలో నిర్మించే ఈ భవనం నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టేందుకు హైకోర్టు రూపకల్పన చేసింది.

నూతన భవన నిర్మాణానికి సిద్ధం..

- జూపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, సిరిసిల్ల



జిల్లా కేంద్రంలో నూతన సమీకృత కోర్టు భవన నిర్మాణానికి సిద్ధం కావడం శుభపరిణామం. ఈ కోర్టు భవనం నిర్మాణానికి పలువురు హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానించేందుకు హైకోర్టుకు వెళ్లి వచ్చాం. ఈనెలాఖరులోగా నూతన కోర్టు భవనానికి శంకుస్థాపన కానుంది.

అరుణాచల యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

భగత్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ విజయమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. భాద్రపదశుద్ధ పౌర్ణమితో పాటు తీర్థయాత్రల టూర్‌లో భాగంగా ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 14న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ అదే రోజు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం 15వ తేదీ మధ్యాహ్నం బస్సు బయల్దేరి జోగులాంబ దర్శనం అనంతరం కరీంనగర్ చేరుకుటుందని పేర్కొ న్నారు. పెద్దలకు రూ.4700, పిల్లలకు రూ.3540 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7382849352, 9959225920, 8074690491 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 82క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు గోనె సంచుల్లో క్వింటాల్ పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7450 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మానకొండూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన టప్ప వెంకటేశం(27) తన మోటార్ సైకిల్‌పై చెంజర్లకు వెళ్తున్నాడు. చెంజర్ల వద్ద మాలోతు శ్రీనివాస్ (37) మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ నేత నీలం మధుముదిరాజ్



హాజరైన ముదిరాజ్ కులస్తులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముదిరాజ్‌లకు సముచిత హక్కులు కల్పించాలని, బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో టీఎంపీఎస్ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న నిజామాబాద్‌లో నిర్వహించనున్న సభలో సీఎం, రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌ల బీసీ-ఏలో చేర్చడంపై ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ముదిరాజ్‌లు అందరూ ఏకతా టిపై ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో జిల్లాకు 30 మంది సర్పంచులను గెలిపించుకుంటామని అన్నారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేసిందన్నారు. సీనియర్ నాయకులు మంద నగేష్ ముదిరాజ్, సుంకరబోయిన మహేష్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరవేణి రంజిత్ ముదిరాజ్, సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర సంపత్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పిట్టల రవీందర్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ కుమార స్వామి ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు మామిడి తిరుపతి ముదిరాజ్, పురం రాజేష్ ముదిరాజ్, నిమ్మల కిషన్ ముదిరాజ్, ఎరవేణి రామాంజనేయులు ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బాలెన్కి మల్లేష్ ముదిరాజ్, గట్టు శ్రీధర్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధులు మౌటం సంపత్ ముదిరాజ్, పిల్లి రవి ముదిరాజ్, బోయిని వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కల్వకుంట్ల కుటుంబం

● అవగాహన లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్ ● మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగార, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో సకల జనుల ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలో ఆయనకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ, మహేష్ బి. గీతే, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన సమావేశం జరిగింది. మంత్రి వివేక్ వెంకటస్వామికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరిక మేర కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో జౌళిశాఖ నుంచి కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుంట్ల కుటుంబం కోసమే పనిచేసిందని ఆరోపించారు. సిరిసిల్లలో ఒకప్పుడు ఇసుక మాఫియా ఉండేదని, ఆ మాఫియాతోనే దళితులు చనిపోయారని, మరికొందరిపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ ప్రాజెక్టుపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీరు అందించాలని గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వం రూ 30 వేల కోట్లతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టిందన్నారు. ఆ ప్రాజెక్టు కోసం రూ 11 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్ కోసం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఆరోపించారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి చేస్తున్నాడన్నారు. ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక ధార్మిక క్షేత్రమైన సిరిసిల్ల జిల్లాకు కార్మిక మంత్రిగా వివేక్‌వెంకటస్వామి మొదటిసారిగా వచ్చారని, జౌళిశాఖపై అవగాహన ఉన్న వివేక్‌వెంకటస్వామి సిరిసిల్ల కార్మికులకు అండదండలు అందించాలని కోరారు. నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆవశ్యకతను నాడు ఏఐసీసీని మెప్పించి ఒప్పించిన వారిలో మొదటివాడు కాకానే అని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, నబేరా బేగం, విజయతిరుపతి, రాణి, రాములు నాయక్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పట్టణ ఉపాధ్యక్షుడు బొప్ప దేవన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామిని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, కత్తెర దేవదాస్, రొడ్డ రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురిలో ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో బుధవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, స్థానిక వేదపండితులు మధు రామశర్మ, కాకెరి గోపాల్ శర్మ, జనుమంచి రాములు శర్మ ధర్మ కర్తలు గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, స్తంభంకాడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వేములవాడలో భవనంపై పిడుగుపాటు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బుధవారం ఓ ఇంటిపై పిడుగు పడింది. పట్టణంలోని భగవంతరావునగర్‌లోని ఓ భవనంపై పిడుగు పడటంతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తులు ధ్వంసమయ్యాయి. చిన్నపాటి వర్షం ఉరుములు, మెరుపులతో రావడంతో ఇంటి పైభాగంలోని గోడపై పిడుగుపడి కొంత భాగం కూలిపోయింది. ఇంట్లోని రిఫ్రిజిరేటర్, ఫ్యాన్‌లు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి అపాయం జరుగలేదు.

● కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో..

కథలాపూర్ : కథలాపూర్ మండలం గంబీర్‌పూర్‌లో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు చిలువేరి గంగనర్సయ్య అనే వ్యక్తి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంటి పనుల్లో నిమగ్నమైన గంగనర్సయ్య కుటుంబం పిడుగుపాటుకు ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది. పిడుగుపాటుతో ఇంటి పైభాగం పెచ్చులూడి పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

● 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం బుధవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 376.827 టీఎంసీ నీరు రాగా, 309.083 టీఎంసీల నీరు వదిలారు.

శ్రీపాద ఎల్లంపల్లిలో..

పెద్దపల్లి : జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం వరకు 75,266క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి 12,500 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 5,252క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 57,514 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. 10గేట్ల ద్వారా 75,266 క్యూసెక్కుల వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 20.175టీఎంసీలకు గాను, 20.175 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

అన్నపూర్ణకు కొనసాగుతున్న ఎత్తిపోతలు


ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.12టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్ 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరులోకి..


బోయినపల్లి : శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు బుధవారం 13,400 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.76 ఉండగా, నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.940 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

దివ్యాంగులకు అండగా ఉంటాం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



దివ్యాంగుల నృత్యాలను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న మానసిక దివ్యాంగుల పాఠశాలలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసిందని తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 మంది దివ్యాంగులకు ఉపకరణాలు, ఇతర సంక్షేమ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. త్వరలో వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మానసిక వికలాంగులకు సేవ చేస్తున్న సిబ్బందికి కలెక్టర్ల ద్వారా ఓ ఏజెన్సీ ఏర్పాటు చేసి వారికి అవుట్ సోర్సింగ్ ద్వారా జీతాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పాఠశాల ఇబ్బందులపై మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని, దీనికి స్పదించిన సీఎం వెంటనే 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసి ట్రస్టు అకౌంట్‌లో జమచేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజ మాట్లాడుతూ. దివ్యాంగుల సంక్షేమానికి బాల భరోసా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ట్రస్టు చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి మానసిక వికలాంగుల పాఠశాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ రాకపోవడంతో సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేక చాలా ఇబ్బందికరంగా పాఠశాలను నడిపిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలపడంతో వెంటనే స్పందించి 50 లక్షల గ్రాంటును విడుదల చేశారని తెలిపారు. వొకేషనల్ కోర్సుల కోసం మరో 40లక్షల నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. అనంతరం దివ్యాంగుల పిల్లలతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కొమ్మురెల్లరెడ్డి, భగవాన్, వెంకటయ్య, ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

రచయిత డాక్టర్ కిరణ్‌కు 'వడ్డేపల్లి' జాతీయ సాహిత్య పురస్కారం

సిరిసిల్ల సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన రచయిత, కవిగా డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అందించే డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ చైతన్య స్ఫూర్తి వంటి సంకలనం, ఓ తండ్రి తీర్పు లఘు చిత్రకథ, కవితలు, వ్యాసాలు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. సుప్రసిద్ధ సినీ గేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ స్మారకార్థం సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరగబోయే ప్రత్యేక కార్యక్రమంలో కిరణ్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.



కిరణ్

బీజేపీ నేతల నారాజ్..

(5వ పేజీ తరువాయి)

ఎన్ రాంచందర్ రావు సమక్షంలో పెద్దపల్లి పట్టణంలో జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నల్ల మనోహర్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆయన కూడా రాష్ట్రకార్యవర్గంలో చోటుకోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అండదండలు ఉండడంతో పాటు జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి ఆయనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి పదవి ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యవర్గంలో చోటు దక్కకపోవడంతో పార్టీ సీనియర్ నాయకులంతా అసంతృప్తిగా ఉన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీలు మారకుండా ఎన్నోఏళ్లుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న తమకు రాష్ట్ర కార్యవర్గంలో పదవులు దక్కకపోవడంపై నారాజ్‌గా ఉన్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన మాజీఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు గట్టి పోటీనిచ్చిన గొమాసే శ్రీనివాస్‌కు కూడా రాష్ట్ర కమిటీలో చోటు దక్కలేదు. ప్రతి జిల్లాకు ఒకరిద్దరు కార్యవర్గ సభ్యులను నియమించనున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, మహిళా, కిసాన్ మోర్చాల్లో కూడా పలు పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఆ పదవులపైనే కొంతమంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఆ పదవులు ఎవరికి దక్కనున్నాయో వేచి చూడాల్సిందే.

పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ



నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ అని అదనపు కలెక్టర్ దాసరివేణు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతిలో ఆయనతోపాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళాశక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, రజకసంఘ నాయకులు, జిల్లా అధికారులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండలాల్లో ఘనంగా నివాళులు..

పెద్దపల్లి కల్చరల్/ఎలిగేడు/సుల్తానాబాద్/ఓదెల/కమాన్‌పూర్/రామగిరి/పాలకుర్తి/కళ్యాణ్‌నగర్: పెద్దపల్లి పట్టణంలోని తిలక్‌నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ పోరాటంలో పాల్గొన్న సందర్భాన్ని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ఆమె అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రజక సంఘం కుల పెద్దమనిషి బొడ్డుపల్లి రామ్మూర్తి, గౌరవ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లినవీన్, బొడ్డుపల్లి కుమారస్వామి, కంది లక్ష్మీరాజం, పవనూరి లక్ష్మయ్య, బొడ్డుపల్లి అశోక్, కృష్ణ, బొడ్డుపల్లి సంపత్, ముక్కెరరాజసం, గుడి కందుల శ్రీనివాస్, ఎల్లబోదారం మొగిలి, రాచమల్ల సతీష్, ముత్తునూరి మల్లి కార్జున్, కొల్లూరి కనకయ్య, రమేష్, నర్సయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు భూత గడ్డ సంపత్, తాడూరి శ్రీమాన్, దొడ్డుపల్లి జగదీష్ పాల్గొన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలో మడేల్‌రాజు యువసేన ఆధ్వర్యంలో జరుగగా యువసేన అధ్యక్షుడు ముంజంపల్లి అనిల్, రాజేశం, సాయిలు, నాయకులు ముంజంపల్లి కొమురయ్య, వంశీ, లచ్చయ్య, రాజేశం, సమ్మయ్య, చంద్రయ్య, వెంకటేష్, ఓదెలు, రమేష్, అభిలాష్, అర్జున్, సంపత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ ఉద్యమ నేపథ్యాన్ని నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ సుల్తానాబాద్‌లో పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో ఐలమ్మ విగ్రహంతోపాటు మున్సిపాలిటీ కార్యాలయంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. స్థానిక రజక సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, మున్సిపల్ కమిష నర్ రమేష్, రజకసంఘం నాయకులు నిట్టూరి అంజయ్య, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దేవేందర్, కుమార్, మున్సి పల్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఓదెల మండ లంలోని కొలనూర్, ఓదెలలో వేర్వేరుగా నిర్వహించిన వర్ధంతి కార్యక్రమాల్లో గుండేటి ఐలయ్య, కందుల అశోక్, గాజుల శివశంకర్, ఆసరి కొమురయ్య, ఓదెలలో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ వాహిని నాయకులు శాతాళ్ల కుమార్, మేరుగు సారంగం, తీర్థాల కుమార్, మేకల రవి, ఎంబాడి సతీష్, దాతరాకేష్ పాల్గొన్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రంతోపాటు జూలపల్లి గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి బీఆర్ఎస్ కమాన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్‌శాఖ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్ పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మల్యాల తిరుపతితోపాటు పలు వురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో తెలంగాణ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లాయువజన విభాగం అధ్యక్షుడు బండి రంజిత్, మండల సంఘం సమన్వకర్త నాగెల్లి సాంబయ్య, నాయకులు దర్శులరాజయ్య, మాదాసి శ్రీనివాస్, రాయమల్లు, సమ్మయ్య, మల్లేష్, పెద్దసంఖ్యలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. పాలకుర్తి మండలం పరిధిలోని కుక్కలగూడూర్‌లో నిర్వహించిన వర్ధంతిలో ఆ గ్రామ రజకసంఘం అధ్యక్షుడు కట్కూరి శ్రీనివాస్, చంద్రశేఖర్,నరేష్,శివ, అనీల్,స్వప్న పాల్గొన్నారు.

మంథని: మంథని రజక సేవా సంఘం, బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీనేతలు వేర్వురుగా వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. స్థానిక చాకలి ఐలమ్మ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పూలమాలలు వేయగా, స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహాన్ని శుభ్రం చేయకపోవడం పట్ల మున్సిపల్ అధికారులపై మాజీఎమ్మెల్యే పుట్ట మధు అసహం వ్యక్తం చేశారు. ఇదేనా మహనీయులను గౌరవించుకునే తీరని ప్రశ్నించారు. వేర్వురుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, రావికంటి సతీష్, ఆరెల్లి కిరణ్, పోలు శివ, బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, తగరం శంకర్‌లాల్, కనవేన శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, మంథని లక్ష్మన్, జంజర్ల శేఖర్, కాయితీ సమ్మయ్య పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: కళ్యాణ్‌నగర్‌లో పెద్దపల్లి జిల్లా రజకసంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేష్ గోదావరిఖని లేబర్‌కోర్టు వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవం ఐలమ్మ అని, ఇదే స్ఫూర్తితో అణగారిన వర్గాలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండపర్తి సంజీవ్, సాయిలు, బండి లక్ష్మణ్, గూడెపు రాంచందర్, ఐలయ్య, మామిడికుమార్, లింగమూర్తి, వాయినాల సతీష్, మహేందర్, దేవయ్య పాల్గొన్నారు. పాలడుగుల కనకయ్య ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ, మల్లయ్య, కుమార్, కృష్ణ, సతీష్, భాగ్య పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో ప్రిన్సిపాల్ వర్సెస్ వైద్యులు

● ప్రిన్సిపాల్ జోక్యంపై డీఎంఈకి ఫిర్యాదు



సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ జోక్యంపై వైద్యులు దండెత్తారు. తమను పనులు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందంటూ వైద్యులు మూకుమ్మడిగా డీఎంఈకి ఫిర్యాదు చేయడంతోపాటు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రిన్సిపాల్ జోక్యం చేసుకుంటూ సూపరింటెండెంట్‌ను అగౌరవ పరుస్తోందని, వైద్యులు విధులు నిర్వహించడంలో, ఫ్యాకల్టీలకు ఇబ్బందులు కలిగిస్తుందంటూ రాష్ట్ర డాక్టర్స్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్‌కు లేఖలు పంపారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో పని చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదని వారు వాపోయారు. కళాశాలలో పనిచేసే ఫాకల్టీలను కూడా మానసిక ఒత్తిడికి గురిచేస్తూ తనకు అనుకూలంగా ఉన్నవారికి మద్దతు పలుకుతూ వేధింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఫ్యాకల్టీలను ఇబ్బందులకు గురిచేయడంవల్ల పనిచేయకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, తక్షణమే ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని వారు డాక్టర్స్ అసోసియేషన్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై త్వరలోనే కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించనున్నట్టు వారు చెప్పారు.

మాజీఎమ్మెల్యే హయాంలోనే మండల అభివృద్ధి

కమాన్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంతోపాటు కమాన్‌పూర్ మండల అభివృద్ధి జరగడంలో మాజీఎమ్మెల్యే పుట్ట మధు కృషి ఎంతో ఉందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ అన్నారు. బుధవారం జూలపల్లిలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్యకార్య కర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు నుంచి జూలపల్లి ఓసీపీ1 వరకు డబుల్ రోడ్డువేసిన ఘనత మాజీఎమ్మెల్యే పుట్టమధుకర్, బీఆర్ఎస్ పార్టీదన్నారు. కార్యక్రమంలో యూత్‌అధ్యక్షుడు బొమ్మగానిఅనిల్‌గౌడ్, మాజీప్రజాప్రతినిధులు మేకల సంపత్‌యాదవ్, కొట్టెభూమయ్య, లక్ష్మీమల్లు, పోలుదాసరి సాయికుమార్, జూలపల్లిగ్రామశాఖఅధ్యక్షుడు వినోద్‌కుమార్, పాల్గొన్నారు.

బాధితురాలికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కమాన్‌పూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారంలో గరిగంటి మల్లయ్య ఇటీవల మృతిచెందగా బుధవారం వారికుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్టమధుకర్ పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న యాదగిరి లక్ష్మిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

మంథని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమైందని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు స్వాగతం పలికి బొకే, శాలువాతో సన్మానించారు. ఏసీపీ రమేష్ మాట్లా డుతూ.. జర్నలిజం అంటే సమాజానికి సామాజిక స్వరమన్నారు.

మైనారిటీ గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీ

మంథనిరూరల్, సెపెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంథని మైనారిటి గురుకుల బాలికలపాఠశాలలో ఖాళీసీట్ల భర్తీకోసం దరఖాస్తులు స్వీకరి స్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామల బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో ఎస్టీ 1సీటు, బీసీ 1సీటు, 6వతరగతిలో బీసీసీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

శ్రీ సత్యసాయి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు

రామగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయిసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో మండలంలోని పలువిద్యాసంస్థల్లో రాష్ట్రస్థాయి వ్యాసరచనపోటీలను బుధవారం నిర్వహించారు. 8,9,10తరగతులకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు.రాష్ట్రజిల్లాస్థాయిలో ఎంపికలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిసాధించిన విద్యార్థికి స్వర్ణ పతకం అందిస్తామన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని పరామర్శించిన కమిషనర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న ఆరేపల్లిచంద్రయ్య నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఆయన కుటుంబాన్ని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకున్నారు. సిబ్బంది, వార్డ్‌ఆఫీసర్లసాయంతో రూ.20వేలు అందజేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో న్యాయవాది సురేష్ బాబు, ఖమ్మంలో ఎండీ జహీర్‌అలీ, ఆదిలాబాద్‌లో మనోజ్ అనే న్యాయవాదులపై జరిగిన దాడులను నిరసిస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విధులను బహిష్కరించారు. అదనపుజిల్లా కోర్టు, సబ్‌కోర్టు, మున్సిఫ్ కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించడంతో విచారణలు నిలిచిపోయాయి. బార్‌అసోసియేషన్ ప్రతినిధులు తౌటంసతీష్, సంజయ్ కుమార్, దేశెట్టిఅంజయ్య, గోపాల్‌రెడ్డి, ముచ్చకుర్తి కుమార్, ఎండీ ఉమర్ పాల్గొన్నారు.

బీసీల విషయంలో కాంగ్రెస్ మొసలి కన్నీరు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

సుల్తానాబాద్/ఓదెల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీల విషయంలో కాంగ్రెస్‌పార్టీ మొసలికన్నీరు కారుస్తోందని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి విమర్శించారు. ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి కడారి అశోక్‌రావు ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ ఓదెలలో ఆయన మాట్లాడుతూ బీసీలవెంట బీజేపీ ఉన్నదని ప్రజలు గుర్తించాలని ఆయన అన్నారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీఅభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీజడ్పీటీసీ గుర్రాల మల్లేశం, నల్లమనోహర్‌రెడ్డి, కడారి అశోక్‌రావు, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, ఏగోలపు సదయ్య, మహిళా మోర్చా జిల్లా నేతలు వనజ, కోట నాగన్న, తిరుపతి, రాజన్న, పట్టణ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, ఓదెల మండలంలోని పొత్కపల్లిలో మండల ప్రభారి కొమ్ము తిరుపతి, మాజీఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మాజీ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు మీసా అర్జున్‌రావు, నల్ల మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కడారి అశోక్‌రావు, మాజీఎంపీపీ కునారపు రేణుక, బిజెపి సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

కష్టకాలంలో యూరియా పక్కదారి

ధర్మారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు యూరియాను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నం చేస్తు రైతులకు అడ్డంగా దొరికిపోయారు. మంగళవారం రాత్రి ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలోని గల ఆగ్రోస్ కేంద్రానికి 220యూరియా బస్తాలు వచ్చాయి. బుధవారం ఉదయం నుంచి వాటిని రైతులకు పంపిణీ చేయాల్సి ఉండగా మంగళవారం రాత్రి పది దాటాక కొంతమంది యూరియాను ట్రాక్టర్లలో, ఆటోల్లో అక్రమంగా తరలించే ప్రయత్నం చేశారు. ఒక్కో రైతుకు ఒక్కబస్తా యూరియా పంపిణీ చేస్తుండగా ఒకేసారి 22బస్తాల యూరియా ఎలా ఇచ్చారంటూ రైతులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని యూరియాను తిరిగి గోదాంలో వేయించారు. సెంటర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, విచారణ అనంతరం సెంటర్‌నిర్వాహకులపై చర్యలు ఉంటాయని ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు.

నేడు ఖనిలో ట్రాఫిక్ దారి మళ్లింపు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం ఆఫీస్ చౌరస్తా, బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న హైటెన్షన్ విద్యుత్‌వైర్ల పనులు జరుగుతున్న దృష్ట్యా గురువారం రాజీవ్‌రహదారిపై గోదావరిఖని పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఉదయం 8నుంచి 12గంటల వరకు మున్సిపాలిటీ చౌరస్తా నుంచి మంచిర్యాలకు వెళ్లేవాహనాలను మళ్లిస్తామన్నారు. మంచిర్యాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను మిలీనియం క్వార్టర్స్, పైవింక్లయిన్ చౌరస్తా, గాంధీచౌరస్తా, మున్సిపల్ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు వస్తాయన్నారు. లారీలు, ఇతర వాహనాలను మేడిపల్లి ఓసీపీ రోడ్ మీదుగా మేడిపల్లి చౌరస్తా రాజీవ్ రహదారికి మళ్లిస్తామన్నారు. కరీంనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోదావరిఖని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు నుంచి గంగానగర్ ఫ్లై ఓవర్ వరకు మళ్లిస్తామన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంకష్టహర చతుర్థి పూజలు

మంథని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలను భక్తులు బుధవారం వైభవంగా నిర్వహించారు. మహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధానఅర్చకుడు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. దీంతో ఆలయ ఆవరణ భక్తులతో సందడిగా మారింది.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి పార్టీశ్రేణులు పనిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య పిలుపునిచ్చారు. బహుజన సమాజ్‌పార్టీ పెద్దపల్లి జిల్లాస్థాయి సమీక్ష సమావేశం బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజనర్సయ్య మాట్లాడుతూ పార్టీ నిర్మాణ పనివిధానం, సెక్టార్, బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటుకు నాయకులు నియోజకవర్గాలవారీగా కార్యాచరణ రూపొందించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్‌యాదవ్, ప్రధానకార్యదర్శి కాంపెల్లి బాబు, మంథని అసెంబ్లీ ఇంచార్జి జనగామ రవికుమార్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, రామగుండం అసెంబ్లీ అధ్యక్షుడు జనగామ లింగయ్య, ప్రధాన కార్యదర్శులు మారపెల్లి రవికుమార్, సాతురి అనిల్, నాయకులు బోయిని, ఇరుగురాల సదానందం, కోటపర్తి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకచట్టం తీసుకురావాలని సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల మల్కాజ్‌గిరి కోర్టు సీనియర్ న్యాయవాది, మేడ్చల్‌బార్ అసోసియేషన్ సభ్యుడు సురేష్‌బాబు, ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు జహీర్‌అలీలపై దాడులను ఖండిస్తూ నిరసనగా బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకచట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి నెలలో మాస్టర్ ప్లాన్: ఎమ్మెల్యే



పూర్ణకుంభంతో కలెక్టర్,ఎమ్మెల్యేను స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఓదెల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల్లో భ్రమరాంబ ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్షతో కలిసి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఏసీ సుప్రియ, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవోలు పూర్ణకుంభంతో కలెక్టర్, ఎమ్మెల్యేని ఘనంగా స్వాగతించారు. స్వామివారి దర్శనం అనంతరం చైర్మన్ చీకట్ల మొండయ్య, అధికారులు, అర్చకులు సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఆలయ అభివృద్ధిపై కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు కలిసి ఆలయ పరిసరాల మ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకుని సీఎం రేవంత్ రెడ్డిని సంప్రదించి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఒగ్గు పూజారులకు టికెట్‌పై వాటా ఇంతకు ముందున్న 25శాతాన్ని 35శాతానికి పెంచి జీవోపత్రాలను కూడా అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఏసీ సుప్రియ, ఆలయచైర్మన్ చీకట్ల మొండయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈవోలు సదయ్య, ముద్దసాని శంకర్, ధర్మకర్తలు, నాయకులు, మాజీసర్పంచులు దాసరి రాజన్న, ఆకుల మహేందర్, బోడకుంట స్వామి, బొంగోని రాజయ్య, పడాల రాజు, అలాగే నాయకులు విజయేందర్ రెడ్డి, బైరి రవి గౌడ్, రెడ్డి రజినీకాంత్, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, ఉడిగే సాదయ్య, ఎండి రఫీ పాల్గొన్నారు.

● యూరియా పంపిణీ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

ఓదెల మండలంలోని కొలనూర్‌లో బుధవారం సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీయూరియా పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతకుంటవిజయరమణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్‌నాయకులు ఎడవెల్లి విజయ పాల్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపునారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి బైరీ రవిగౌడ్, మాజీ సర్పంచ్ సామ శంకర్, గుండేటి ఐలయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తా

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలను బుధవారం ఆయన సందర్శించి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను చదువుకున్న అప్పన్నపేట పాఠశాల తనను ఈ స్థాయికి తెచ్చిందని గుర్తుచేశారు. చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలను మననం చేసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్ తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో సమస్య ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికై మొదటిసారి తాను చదువుకున్న పాఠశాలకు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు హామీలు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్యసంఘాలు అమలు చేయాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో టీబీజీకేఎస్ బృందం కార్మికులను కలిసి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా అయిలిశ్రీనివాస్ మాట్లాడారు. ఏఐటీయూసీ 47, ఐఎన్‌టీయూసీ 36 హామీలు ఇచ్చిన విషయాన్ని ఆయా యూనియన్లు గుర్తు చేసుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం మీద ఒత్తిడి తెచ్చేలా టీబీజీకే ఎస్ చేపట్టనున్న ఆందోళనలకు కార్మికవర్గం కలిసి రావాలని అయిలి శ్రీనివాస్ కోరారు.



దసరా సెలవు తేదీని మార్పుచేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవు తేదీలో మార్పుచేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి మాట్లాడారు. తెలంగాణలో దసరా పెద్దపండుగ అని గాంధీ జయంతి, దసరా ఒకే రోజు వస్తున్నందున కార్మికులకు వెసులుబాటు కల్పించేలా సెలవును మార్పు చేయాలని కోరారు.

కోల్‌ఇండియా ఒప్పందాలను అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోల్‌ఇండియా బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయాలను సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ-2 యూనియన్ ఆఫీస్‌లో కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 31న జరిగిన 481కోల్ ఇండియా బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కాంట్రాక్టు కార్మికులకు అదనపు ప్రయోజనాలు కల్పించేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్టు తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వలయోజన పథకంలో కోల్ ఇండి యా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని బాగస్వాములు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు వార్షిక క్రీడాఉత్సవాలను నిర్వహించేలా నిర్ణయాలు జరిగినట్టు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. కోల్ ఇండియా బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో జరిగిన నిర్ణయాలను సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం అమలు చేయాలని, లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా ఇవ్వాలని సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో చెన్నూరి రమేష్, గట్టు శ్రీనివాస్, మహేందర్, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్, పోచయ్య ఆవుల రంగయ్య పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన సింగరేణి రెస్క్యూపోటీలు



రెస్క్యూ బృందాన్ని పరిచయం చేసుకుంటున్న ఉమేష్ సావర్కర్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10: స్థానిక రెస్క్యూస్టేషన్ ఆవరణలో 54వజోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్) వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవానికి డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ ఉమేష్ ఎం సావర్కర్(హైద్రాబాద్ రీజియన్) ముఖ్య అతిథిగా హాజరై రెస్క్యూ పతాకాన్ని ఎగురవేశారు. రెస్క్యూ జట్ల గౌరవ వందనాన్ని స్వీకరించిన డీఎంఎస్ ఉమేష్ సావర్కర్ మాట్లాడారు. సింగరేణి రెస్క్యూ అంతర్జాతీయస్థాయి ప్రమాణాలను అందిపుచ్చుకుంటూ ఇతర మైనింగ్ సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. అనుభవం ఉన్న సిబ్బంది, యువకులతో కూడిన సింగరేణి రెస్క్యూ బృందాలు సంస్థకు అదనపు బలమని, మహిళా ఉద్యోగినిలతో రెస్క్యూటీం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీఎంఎస్ అన్నారు. ఉత్పత్తి ప్రక్రియలో రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పోటీలకు హాజరైన జట్లను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఎస్‌లు నాగేశ్వరరావు, జార్జ్‌జాన్ ఏడీఎంఎస్, సింగరేణి సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ-3,1 జీఎంలు సుధాకర్‌రావు, లలిత్‌కుమార్, రెస్క్యూజీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్జీ-2 అఫీషియేటింగ్ జీఎం రాముడు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్‌సెక్రెటరీలు అధికారులు గురువయ్య, రెస్క్యూజీఎం వెంకటేశ్వర్లు ఆర్జీ-1,2,3 ఏరియాల జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్వీ సూర్యనారాయణ, సుధాకర్‌రావుతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న న్యూడెమోక్రసీ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ ఆర్థికశాఖమంత్రి బెజాలెలే స్మాట్రిక్‌భారత్ పర్యటనను వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయకార్యదర్శి ఈదునూరినరేష్ పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని ఫైలాన్ చౌరస్తా వద్ద న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజాలో తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించాలని, మారణహోమానికి కారణమైన ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహ్యపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఐ కృష్ణ, దుర్గయ్య, మల్లేషం, కొమురయ్య, సదానందంబాబు, ధర్మేందర్, ప్రేమ్‌కుమార్, పోషం, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రేణులుకాలనీలో నిరసన చేపట్టారు. నల్లజెండాలతో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మదునమ్మ, లింగయ్య, నాగరాజు, గుడిసెల స్వామి, రాయమల్లు, నరేష్, కొంరమ్మ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు పరీక్షలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ద్వారా 2024-25 ఆర్థిక సంవ్సరానికి గాను వివిధ రకాల వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి అరవిందరావు ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ ఆధ్వర్యంలో ఈనెల12వతేదీ ఉదయం 10గంటలకు సెక్టార్-3 సింగరేణిహైస్కూల్‌లో పరీక్ష నిర్వహిం చనున్నట్టు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్టు అరవిందరావు తెలిపారు.

ఎస్అండ్‌డీ సెక్షన్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బీసీఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఓసీపీ-3 ఎస్అండ్‌డీ సెక్షన్‌లో చాకలిఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐలమ్మ తెలంగాణ వీరత్వానికి నిదర్శనమని, ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శమని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, వేముల కిరణ్, అనుమాండ్ల నవీన్‌కుమార్, రవీందర్, శ్రీధర్, వెంకటేష్, ఉడుత శ్రీవాణ్, తోట కొంరయ్య, రత్నాకర్, రవీంద్రాచారి, రాజేశం, సదయ్య పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణను విజయవంతం చేయండి

రామగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సొంత ఇంటి పథకంపై నిర్వహించే అభి ప్రాయ సేకరణను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్రఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపు నిచ్చారు. బుధవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో నిర్వహించే గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు సొంతింటి కలను నేరవేర్చకపోవ డంపై ఈనెల11,12తేదీల్లో కార్మికులతో నిర్వ హించే ప్రజాభిప్రాయ సేకరణకు ముందుకు రావాలనిపిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆర్జీ-3బ్రాంచ్‌సెక్రెటరీ కొము రయ్య, నాయకులు రమణరెడ్డి, కుమార్, రవి కుమార్, సదానందం, వెంటేష్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మారుపేర్ల సమస్యలు పరిష్కరించకపోతే..

ఏఐటీయూసీ కార్యాలయాలు ముట్టడిస్తాం

గోదావరిఖని, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్ల సమస్యలు, విజిలెన్స్ పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించేకపోతే గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్యాలయాలను ముట్టడిస్తామని మారుపేర్ల సంఘం నాయకులు లక్కం శ్రావణ్ హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుపేర్ల సమస్య పరిష్కారం కోసం మా బాధలు మొరపెట్టుకోవడానికి ఏఐటీయూసీ కార్యాలయానికి వెళితే నాయకులు సరైన సమాధానం చెప్పకుండా దాట వేశారని, సింగరేణి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మారుపేర్ల సమస్యపై తక్షణమే ముఖ్యమంత్రితో అపాయిమెంట్ తీసుకుని మాట్లాడాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే సింగరేణివ్యాప్తంగా ఉన్న ఏఐటీయూసీ కార్యాలయాలను ముట్టడిస్తామని చెప్పారు. సమావేశంలో జక్కు శ్రావణ్, డిష్ బాబు, హరీష్, సత్యం, సంతోష్, సందీప్, వంశీ, రవికుమార్, రాజు, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.